కథ:

# తీర్పు

= శ్రీ ధనికొండ హనుమంతరావు =

సూర్యుని లేతకిరణాలు కిటికీలోంచి ముఖం మీద పడి, కల్యాణిని అప్పుడే మేల్కొల్పినయ్. ఆమె ఒళ్లు విరుచుకొని, బద్ధకంగా పక్క మీద లేచి కూర్చొని పక్కగదిలో జరిగే సంభాషణను వినసాగింది—

"...ఏమిమ్మంటావ్?"

"మీ ఇష్టం—"

"అదెట్లా? ఇదివరకతనికి ముప్ఫై ఇచ్చేవాళ్లం"

"నాకూ అలాగే ఇప్పించండి"

"ఎప్పటినుంచీ రాగలవు?"

"ఇవాల్టినుంచీను."

"సరే... ఆఫీసువేళకల్లా రా—"

ఒక గొంతు భర్తది. రెండోగొంతు ఆమెకు కొత్తదైనా, అందులో ఏదో విశేషం ఉన్నట్టుగా ఆమెకు తోచింది. ఆరెండోవ్యక్తి ఎవరో చూడాలని ఆమెకు కుతూహలం కలిగింది. సంభాషణ అయిపోయ్యేవేళకల్లా ఆమె గదిగుమ్మందగ్గరకు వచ్చి, గుమ్మానికి కట్టివున్న తెరను కొద్దిగా తొలిగించి చూసింది. ముప్ఫై ఏళ్లపై వయస్సువ్యక్తి అప్పుడే లేచి వెళ్లబోతున్నాడు. మాసిన అతని బట్టలూ, చిక్కిన అతని శరీరమూ బీదరికాన్ని చాటుతున్నయ్. మంగలి కత్తికోసం ఎదురుచూసే అతని గడ్డం అతనికి జీవితం మీద ఏర్పడ్డ నిర్లక్ష్యతను చెప్తోంది. లోతుగా ఎర్రపడ్డ అతని కళ్లు జీవితంలో అనుభవించిన బాధ క్రూరతగా మారికూర్చోవటాన్ని చూపుతున్నయ్. ఆ కళ్లలోని ఎరుపు లోకంమీద అతనికి కలిగిన కోపంలాగుంది. ఆ పెద్ద బొచ్చుటోపీకింద అతని తల భయంకరంగా వుంది. ఒక్కక్షణం కల్యాణిచూపుల్తో అతని చూపులు కలుసుకున్నయ్. అసలు ఆవ్యక్తిని చూడగానే కల్యాణికి ఎందుకోగాని భయం వేసి, ఒక్క క్షణమైనా ఆప్రదేశంలో నిలబడలేక వెనక్కు వచ్చేసింది.

భర్త వచ్చి, "అబ్బాయి ఏడీ?" అనేదాకా కల్యాణి ఆ కొత్తవ్యక్తిని గూర్చిన ఆలోచనలోంచి బైటపడలేకపోయింది.

ప్రసాద్ ప్రశ్నకు జవాబుగా బైట కారుహారన్ మోగింది. కల్యాణి నవ్వి "మూడురోజుల్నుంచీ డ్రైవింగు నేర్చుకుంటున్నాడు—" అంది.

ప్రసాద్ నవ్వి, కారుదగ్గరికి వెళ్లి, "ఏం చేస్తున్నావ్ వేణూ?" అన్నాడు.

"కార్లో ఎక్కనాన్నా! షికారువెళ్దాం"

"ఇందాకటినుంచీ నువ్వు కార్లో తిరిగివచ్చావుగా? చాల్లే—" అని ఆ ఎనిమిదేళ్ల కుర్రాణ్ని చెయ్యి పట్టుకు నడిపించుకొని తీసుకువెళ్లాడు.

ఆమధ్యాహ్నం ప్రసాద్ ఆఫీసుకు వెళ్లబోతూ, "డ్రైవరు వచ్చాడు; నన్ను కోర్టులో దింపి కారు తీసుకువస్తాడు...ఎక్కడికైనా వెళ్లివస్తే వెళ్లిరా—" అన్నాడు.

"నేనూ, అమ్మను—"అన్నాడు కుర్రవాడు.

"ఊఁ. మీ ఇద్దరూను" అని వాడి బుగ్గ గిల్లి, ప్రసాద్ వెళ్లిపొయ్యాడు.

మరో అరగంటకల్లా కారు తిరిగివచ్చింది. దాసీది వచ్చి, "అమ్మగారూ! ఎక్కడికన్నా వెళ్తారా?" అని అడిగింది.

కల్యాణి విసుగ్గా "ఊహుఁ" అని సమాధానమిచ్చి దాసీదాన్ని సాగనంపింది.

ఉదయాన ఆ కొత్తవ్యక్తిముఖం చూసినప్పటినుంచీ కల్యాణికి ఎందుకోగాని కష్టంగా వుంది. అంత పెద్ద బంగళాలో కూర్చొని ఏం చెయ్యాలోకూడా ఆమెకు తోచడంలేదు. ఏదో చదువుకోబోయింది; కాని ఆ చదివేది ఆమెకు అర్థమవనేలేదు. కిటికీదగ్గర కుర్చీ వేసుకొని బైటి తోటలోకీ, దూరాన ఆకాశం భూమితో కలిసే ప్రదేశంలోకీ చూడటంతో ఒక గంట గడిపింది.

కుర్రాడు వచ్చి తల్లిచీరకొంగు పట్టుకొని వేళ్లాడుతూ, "అమ్మా! కారెక్కి వెళ్దామే!" అని నసగసాగాడు.

ఈవూరువచ్చిన నాలుగోరోజిది. ఈ నూతన వాతావరణం ఎలా వుంటుందో, ఇక్కడి ప్రజలు ఎలా బతుకుతూంటారో, ఇక్కడి గాలి ఎలా వుంటుందో మొదలైన అనేకవిషయాల్ని ఆమె ఇక్కడికి రాకపూర్వం ఆలోచించింది. కాని ఆమెఊహకేమీ తట్టలేదు. ఇప్పుడు యేమీ తోచకపోవటంవల్ల, కారులో నాలుగుబజార్లూ తిరిగివస్తే కాలం కొంత సాగుతుంది. ఈ ఉద్దేశంతో, కుర్రాణ్ని ప్రోత్సహిస్తూన్నట్టు, "సరే...బట్టలు వేసుకో" అంది.

ఆమె దాసీని పిలిచి, "డ్రైవరు ఏం చేస్తున్నాడు?" అంది.

"కారుషెడ్డులో కూర్చున్నాడమ్మా!"

"కారు సిద్ధంచెయ్యమను" అని మొహం కడుక్కొని, తన హోదాకు సరిపడే దుస్తుల్ని ధరించి, కుర్రాడితోపాటు పోర్టికోలోకి వచ్చింది. ఉదయాన ఆమె చూసిన వ్యక్తే దుస్తులమార్పుతో డ్రైవరుగా నిలబడి, వెనుకసీటుతలుపు తెరిచాడు. అతన్ని చూడగానే ఆమెలో ఏదో బలహీనత్వం ప్రవేశించింది. కారణం ఆమెకే తెలియదు. తను అనవసరంగా ఇలా భయపడటంలో అర్థమేమీ లేదనుకొని, ఒకసారి అతని ముఖంలోకి ధైర్యంగా చూడటానికి ప్రయత్నించింది. కాని అతని కళ్లు! ఆచూపును, ఆ అగాధాన్నీ ఆమె భరించలేకపోయింది. మళ్లీ చూద్దామన్నా ఆమెకు ధైర్యం చాలలేదు.

కుర్రాడు తన చేతిపట్టును తనకు తెలియకుండానే వదిలించుకొని వెళ్లి కార్లో కూర్చొని, "రా అమ్మా!" అంటున్నాడు. ఆమె ఒక్కసారిగా నిద్రనుంచి మేల్కొన్నట్టు కళ్లెత్తి చూసి, మెల్లిగా వెళ్లి వాడిపక్కనే కూర్చుంది.

డ్రైవరు ముందుసీటులో కూర్చొని ఇంజను స్టార్టుచేసి,ముందుచూపుతోనే అడిగాడు: "ఎక్కడికి—అమ్మగారూ?"

ఆమె వెంటనే సమాధానం చెప్పలేకపోయింది. అతని గొంతుకూడా ఆమెనరాలపటుత్వంమీద దెబ్బతియ్యగలదన్నట్టుంది! కాస్త తడబడుతూ సమాధానమిచ్చింది: "పోనీ...ఊళ్లోకి...ఊరంతా తిప్పు!" చివరిమాటకు కుర్రాడికి చాలా సంతోషంగా వుంది!

కారు బయలుదేరింది. అతివేగంగా వెళ్తూన్న కారులో — కుర్రాడు ఒకచివరకు జేరి, తల బైటికి పెట్టి చరచరా సాగిపొయ్యే దృశ్యాల్ని చూసి ఆనందిస్తున్నాడు. కాని ఆమెను బైటిదృశ్యాలేమీ ఆకర్షించటం లేదు. గాలికి రెపరెపలాడే పైటకొంగును తీసి కంఠానికి చుట్టుకుంది. ముంగురులు తమ ఇష్టం వచ్చినట్టు ముఖంమీద ఆటలాడుకుంటూన్నా ఆమెకు లక్ష్యమే లేదు. అసలు తను దేన్నిగూర్చి ఆలోచిస్తోందోకూడా ఆమెకే తెలియదు...

ఒక్కసారిగా ముందుకు చూసింది. ముందున్న అద్దంలో తన ప్రతిబింబాన్ని డ్రైవరు పరీక్షగా చూస్తూన్నట్టు ఆమెకు అనుమానం కలిగింది. పురుషులు అనేకమంది తనవైపు చూడటం ఆమెకు కొత్తకాదు. ఇదివరకుండే డ్రైవరు రోడ్డుమీదికి ఒకకన్నుంచి, రెండోకంటితో తన పాపను చూస్తూండటంకూడా ఆమె మరిచిపోలేదు. అప్పుడు ఆమెను బాధించని ఏచూపూ ఇప్పుడు యీడ్రైవరుపాల పడి, తనకు కోపంకూడా తెప్పించింది.

కాస్త పెద్దగా, అధికారస్వరంతో, "స్పీడు తగ్గించు- తొందరేమీ లేదు" అంది.

వెంటనే కారువేగం తగ్గింది. కుర్రాడికి ఇది నిరుత్సాహంగా తోచి, ఏమీ అనలేక, తల్లివైపు ఒక్కక్షణం బిక్కమొగం వేసి చూశాడు.

ఆమె మళ్లీ, "బజారుకు...... బట్టలకొట్టుకు పోనీ" అంది.

కారు వెంటనే మలుపు తిరిగింది. అతను లోపల ఏమనుకున్నాడో కాని, ఆమెమాటలుమాత్రం వెంటవెంటనే క్రియారూపం తాలుస్తున్నవి. ఒక్కొక్క వ్యక్తికి ఎంత అధికారం వుంటుంది! మాటలు ఒక్కొక్క నోట ఒక్కొక్క అర్థాన్నికూడా ఇస్తుంటయ్ కాబోలు.

బట్టలకొట్టుముందు కారాగగానే, ఆమె కుర్రాడితో కొట్లోకి వెళ్లి, అరగంట బేరమాడి, బట్టలన్నీ మూటకట్టించి, డబ్బు చెల్లించి బైటికి వచ్చింది. డ్రైవరు తలుపు తెరవగానే కార్లో కూర్చొని, అతని వైపు చూడకుండానే, "లోపల మూట వుంది–" అంది అస్పష్టంగా.

అప్పటికే కొట్టువాడు బైటిదాకా మోసుకొచ్చిన మూటను అందుకొని కారులో పెట్టి, ఒక నిమిషంసేపు డ్రైవరు ఆమెముఖంలోకి చూశాడు. ...ఎంత ధైర్యం! ఆమె యీచూపును గమనించనట్టు నటించినా, ఏదో మనస్సులో ఆందోళనగానే వుంది.

డ్రైవరు తన సీటులోకి వెళ్లగానే ఆమె అప్రయత్నంగా, "ఇదుగో— నీపేరేమిటి?" అంది.

అతను వెనక్కు తిరిగిచూడకుండానే "శర్మ" అన్నాడు.

ఈమాటతో అతని గడ్డాన్ని పట్టి మహమ్మదీయుడా, హిందువా అన్న ఆమెఅనుమానం పూర్తిగా తేలిపోయింది. "శర్మ–శర్మ" అనుకుంది మనస్సులో. ఆపేరు ఎక్కడో విన్నట్టు గుర్తు. జ్ఞాపకం చేసుకోవాలని ఆమె చాలా ప్రయత్నించింది. కాని ఆమెకు తగిన సహాయ మేమీ దొరికేట్టు కనిపించలేదు.

ఇక యీ కారులో కూర్చొని తిరగాలనే కుతూహలంకూడా ఆమెకు బాగా తగ్గిపోయింది. ఊరు మూడకముం దుండే ఆదుర్దా, చూస్తూన్నప్పుడు లేకపోవటం సహజమేనేమో ?

"ఇంటికి పోనీ—"

ఇంటి గుమ్మంలో కారాగగానే ఆమె దిగి, ఇంట్లోకి వెళ్లబోతూ, ఒకసారి వెనక్కు తిరిగి డ్రైవర్ను చూసింది. అతను పెదిమలు బిగబట్టి, పదునుగా తనవైపే చూస్తున్నాడు. ఆమె విసుగుతో కోపంగా నేలను తన్ని తన గదిలోకి వెళ్లిపోయింది. అప్పటికి కాని ఆమె కేదో ఒత్తిడి తగ్గినట్టుగా తోచలేదు.

చాలాసేపటివరకూ యీ డ్రైవర్ను గూర్చి ఆలోచించింది. అతని ప్రవర్తన, ఆకారమూ, గడ్డమూ, కంఠమూ— అన్నీ ఏదో వింతవస్తువులుగా కనిపించినయ్. అతని ముఖం మరిచిపోతూన్న ఏదో విషయాన్ని జ్ఞాపకం చేసేందుకు ప్రయత్నిస్తూన్నట్టు తోచింది.

అసలు యీ ఆలోచనతో బాధపడటంకూడా ఆమెకు అనవసరంగా తోచింది. మనస్సును తనకు తానై మెలేసుకొని మనశ్శాంతిని పాడు చేసుకుంటూన్నట్టనిపించింది.

చప్పున కుర్రాడు జ్ఞాపకం వచ్చాడు. తనకు తోచనప్పుడల్లా కుర్రాడితోనే ఉత్సాహంగా ఆడుకోవటం ఆమెకు అలవాటు. వాడికోసమని గదంతా కలయజూచింది; లేడు. దూరాన నవ్వులు విని, కిటికీలోంచి తోటలోకి చూసింది. అక్కడ డ్రైవరువీపుమీద ఎక్కి వాడు గుర్రంఆట ఆడుకుంటున్నాడు. డ్రైవరుముఖంలో తనకు కనిపించే క్రూరత యేదీ వాడికి కనిపించటం లేదు కాబోలు! కొత్తవాళ్లదగ్గర చప్పున అలవాటుపడని వీడు డ్రైవరుతో ఇట్టే కలిసిపోవటం ఆమెకు ఆశ్చర్యంగానే వుంది. డ్రైవరు తన యీడు నంతట్నీ మరిచిపోయి యీచిన్నకుర్రాడితో ఆడుకోవట మేమిటి? తనూ ఆడుకుంటుంది కాని— అది తనకు పుత్రుడిమీద వున్న ప్రేమ! కాని ఇతర్లకు పరాయిబిడ్డలమీద ప్రేమేమిటి ? "జీవితంలో ఎప్పుడన్నా అతను ఇలాటి కొడుకును పోగొట్టుకున్నాడేమో?" అనుకుంది.

వాళ్లి ఆట చూస్తూ కూర్చుంది. కుర్రాడు నవ్వు ఆపుకోలేక నేలమీద పడి దొర్లుతున్నాడు.

వాడు లేచేప్పటికి వాడి గుడ్డలన్నీ పాడయినయ్. వాడు దీన్ని లెక్క చెయ్యకుండానే డ్రైవరుగడ్డం పట్టుకొని, అతని తలను అటూ ఇటూ ఆడిస్తూ ఆనందిస్తున్నాడు.

జడ్జీగారి కొడుకు సేవకుడైన డ్రైవరుతో ఆడుకోవట మేమిటి ?—ఒక్కసారిగా సమాజంలోని తన స్థానాన్ని ఆమె గుర్తించింది. ఈ సేవకులకు యీ విధంగా అలుసివ్వటం యెంతప్రమాదం...! ఒకపక్క నిలబడి యీవినోదాన్ని చూసి నవ్వుతూన్న దాసీదాని నవ్వుకూడా ఆమెఅభిమానాన్ని మేల్కొలిపింది. వెంటనే కుర్రాణ్ని పిలిచింది.

వాడు తలెత్తి చూసి, "వస్తాలే—" అని తన ఆటలో జోరబడబోతున్నాడు.

"నీకే...ఇట్లా రారా!" అంది మళ్లీ.

"ఎందుకూ?" అన్నాడు వాడు సూటిగా ఆమె వైపు చూస్తూ.

"రమ్మంటే..." కల్పితకోపాన్ని కంఠానికి జతచేసి ప్రయోగించింది.

"వస్తాలే...కాసేపుండి—"

డ్రైవరు లేచి నిలబడి ఒకసారి ఆమెవైపు చూశాడు. ఆమె యీచూపును తప్పించుకోవాలని చూసింది. అతను అస లేమీ జరగనట్టే కుర్రాణ్ని ఎత్తుకొచ్చి సావిట్లో దింపి, "అమ్మగారు పిలుస్తున్నారు...వెళ్లండి—" అని తను షెడ్డులోకి వెళ్లిపోయ్యాడు.

కుర్రాడు నిరుత్సాహంతో కోపాన్ని తెచ్చుకొని, చరచరా గదిలోకి వచ్చి, "ఎందుకమ్మా?" అన్నాడు.

ఆమె కోపంతో, "ఆ బట్టలన్నీ ఎందుకు పాడు చేసుకున్నావ్ ?" అంది.

"ఆడుకుంటున్నాను—"

"డ్రైవరుతో ఏం ఆట ?"

"అతను మంచివాడమ్మా!"

వాడికి కనిపించే మంచితనం తను కనుక్కోలేకపోయినందుకు విచారిస్తూ, "సరే...ఆగుడ్డలు విప్పి నీళ్లు పోసుకురా—ఫో—" అంది.

"కాసేపు ఆడుకొని..." అని వాడు మెల్లిగా తప్పించుకోవాలని ముందుకు రెండడుగులు వేశాడు.

కాని వెనుకనుంచి తల్లి కసురుకుంటూ, "నీక్కాదురా చెప్పేది ?—మళ్లీ షికారు వెళ్దాం—" అంది.

ఈ చివరిమాటకు వాడు లొంగిపోయ్యాడు. చప్పున తయారయేందుకని పరుగెత్తాడు. వాడు వెళ్లగానే కల్యాణి దాసీని పిలిచి, "డ్రైవరు ఏంచేస్తున్నాడు?" అంది.

"ఇప్పుడే కారు తీసుకొని కోర్టుకు వెళ్లాడమ్మా"

కల్యాణి మాట్లాడకుండా సాలోచనగా అటూ ఇటూ చూడసాగింది.

౨

కుర్రాడు షికారుదుస్తులు వేసుకొని సిద్ధమై, "అమ్మా! వెళ్దాం—పా" అని తల్లిదగ్గర మారాం చెయ్యసాగాడు.

"కారు లేదు; నాన్నగార్ని తీసుకొచ్చేందుకు వెళ్లింది...రానీ!" అని కల్యాణి వాణ్ని ఎలాగో ఊరుకోబెట్టింది.

కారురాకకోసం కిటికీలోంచి ఎదురుచూస్తూ ఆ బుల్లిబుర్రతో వా డేదో ఆలోచించుకుంటున్నాడు. కల్యాణికూడా ఇంకోదిక్కు చూస్తూనే తన మామూలుసమస్యలోకి వెళ్లిపోయింది. ఇతను కనిపించిన మొట్టమొదటిక్షణంనుంచీ ఆమెకు అనేకఇతర వస్తువులమీది శ్రద్ధ తగ్గిపోయింది. కారణం ఆమెకే తెలియదు.

ఈ కుర్రాడు ఒక గంటలో డ్రైవరుతో స్నేహం సంపాయించగలిగాడు. వాళ్లిద్దరి ఆశయాలూ, యీడూ, వ్యక్తిత్వమూ—ఏదీ ఒకటి కాకపోయినా, ఒకే మెట్టుమీద ఇద్దరూ సర్దుకొని పిచ్చిఆటలోని ఆనందాన్ని అనుభవించగలిగారు. కాని యీవ్యక్తిని చూసిన మొట్టమొదటి క్షణానే అతనిమీద గంపెడు

అనుమానం తనకు ఎందుకు కలగాలి? లోకంలోని వ్యక్తుల్లో కొందరిని మొట్టమొదట చూడగానే పెద్ద అభిమానం కలుగుతుంది; మరికొందరిమీద గొప్ప అసహ్యభావం కలుగుతుంది. మొదటివారు చేసిన మేలూ లేదు; రెండోవారు చేసిన కీడూ లేదు. మరి యీ కారణంలేని అభిప్రాయం కలిగేందుకు ఏమన్నా కారణ ముందా? ఆమె తన కున్న విజ్ఞానంతో యీవిషయాన్ని తెలుసుకోలేకపోయింది. ఇంతకుపూర్వం అనేకమంది ఇలాటి అనుమానంతో బాధపడి చివరకు ఏకారణాన్నీ కనుక్కోలేక విసిగి, వదులుకున్నారని ఆమెకుమాత్రం తెలియదు!

కాని ఒకటిమాత్రం నిజం...ఈ డ్రైవరుమీద తనకు కలిగిన అభిప్రాయం తను బుద్ధిపూర్వకంగా తెచ్చుకున్నది కాదు. తనకు తెలియకుండా, తన అనుజ్ఞ లేకుండా అది తనంతతానే తనలో ఒక స్థానాన్ని ఏర్పరుచుకోగలిగింది. అందుకనే యీ అభిప్రాయాన్ని తను పోగొట్టుకునేందుకు ప్రయత్నించి తప్పకుండా జయించవచ్చుకూడాను. నిజమే — ఇది వట్టి భ్రమ! తన నీడను చూసి తను భయపడటంలాటిది! పాపం — అతను తన కేం హాని చేశాడు? ఎంతో గౌరవంగా 'అమ్మగారూ!' అని పిలుస్తాడు. తమ సేవ చేసుకొని బతికే ఇంతమంది సేవకులమీద తనకు కలిగే దయకు అతనుమాత్రం ఎందుకు దూరమవ్వాలి? బీదరికం అసహ్యంచుకునే వస్తువే అయితే—ముందుగా తన పుట్టింటివారిమీద తనకు అంతులేని అసహ్యత కలిగితీరాల్సింది!

కారుమోత వినగానే పుత్రుడు సంతోషంతో కేకవేసి నాట్యం చేయసాగాడు. ఈ చప్పుడుకు ఆమె ఆలోచనాసముద్రంలోంచి మేల్కొనేప్పటికే ప్రసాద్ పుత్రుణ్ని ఎత్తుకొని తన ఎదుట నిలబడి ఉన్నాడు.

పుత్రుడు, "నాన్నా! షికారు వెళ్దాం ... అమ్మా, నేనూ వెళ్తున్నాం. నువ్వుకూడా రా—" అని కారు తనదైనట్టూ, అందులోని కొంతభాగాన్ని తను యీతండ్రికి బహూకరిస్తున్నట్టూ ఆహ్వానించాడు.

"షికారా?—ఏం కల్యాణీ! అట్లా ఉన్నావ్?"

తన స్థితి ముఖంలో ప్రతిఫలించేటంతవరకూ వచ్చినందుకు ఆమె నొచ్చుకుంటూ, వెంటనే బలవంతాన ముఖకళను మార్చి నవ్వుతూ, "ఎట్లా వున్నాను?...ఇందాకా బజారువెళ్లి బట్టలు తెచ్చుకున్నాం" అని మాటలధోరణిని మార్చగలిగింది.

"ఊఁ" అని తలవూపి, వంటవాడు సిద్ధంచేసిన టీ తాగుతూ ప్రసాద్ అన్నాడు: "డ్రైవరు చాలా యోగ్యుడులా గుంది. చాకచక్యంతో కారు నడపగలడు. అణకువకూడా వుంది—"

భర్తకూ, కొడుక్కూ కనిపించే ఆ యోగ్యత తను కనుక్కోలేకుండా చేసిన తన బలహీనత్వమేమిటో ఆమెకు అర్థమవటం లేదు.

"మంచివాడు నాన్నా! చాలా మంచివాడు—అతని గడ్డం ఇంకా పెరుగుతుంది!" అన్నాడు పుత్రుడు.

కల్యాణి బలవంతాన తన అభిప్రాయాన్ని వెంటనే మార్చుకొనే గట్టి ప్రయత్నపు మొట్టమొదటి మెట్టుగా, "అవును...చాలా మంచివాడు" అంది.

పుత్రుడుమాత్రం తన పాతపాటను వదలలేదు. "నాన్నా! షికారు!" అని ఎత్తుకున్నాడు.

ప్రసాద్ నవ్వి, "వా డంతగా అడుగుతూంటే షికారు వెళ్లరాదూ!" అన్నాడు భార్యతో.

"ఏం షికారురా? కాసేపు ఆడుకోరాదూ?" అంది కల్యాణి, కోపాన్ని నటిస్తూ.

పుత్రుడు నిరుత్సాహపడి తండ్రిసహాయం కోసం దీనంగా చూశాడు.

"వెళ్లి రా—నడవాలా ఏమన్నానా? కాళ్లకు మట్టి కాకుండానే తల్లీకొడుకులు షికారు వెళ్లిరాగలరుగా!"

భర్తమాటను ఆమె కాదనలేకపోయింది. కొంత చల్లగాలి తగులుతే తనలో అనవసరంగా రేగిన యీ తుపానుకు సంబంధించిన వేడికూడా తగ్గవచ్చు. అదీకాక తను ఒప్పుకోక కారణాల్ని చెప్పాల్సివస్తే భర్తముందు బైటపడటంగూడా అవుతుంది. ఐనా అంది: "మీరుకూడా రండి."

"నాకు చాలా పని వుంది... నువ్వూ, వాడూ వెళ్లిరండి."

తను కాపరానికి వచ్చిన మొట్టమొదటి రోజు నుంచీకూడా ఆమె కొక పెద్ద అనుమానం వుంది. గవర్నమెంటువారు తన భర్తజీవితంలోని రోజుల్లో కొద్దిభాగాన్నే తమ పనులకోసం కొన్నారా, లేక అతని జీవితాన్నే కొన్నారా అనే సంశయం! ఎందుకంటే, ప్రసాద్‌కు ఎప్పుడూ ప్రత్యేకమైన గది ఒకటి వుంది. గదిలో చుట్టూ వున్న బీరువాల్లో అన్నీ లా పుస్తకాలే. మధ్య ఒక టేబిలు, కూర్చుని చదువుకు నేందుకు ఒక రివాల్వింగ్ కుర్చీ, గదిలోనే ఒకపక్కన అతను పరుండే మంచమూ అమర్చబడివుంటయ్. ప్రసాద్ ఇంటిదగ్గర ఉండేకాలంలోని అత్యధిక భాగాన్ని ఆగదిలోనే గడుపుతూంటాడు. రాత్రులు చాలా సేపటివరకూ మేలుకొంటాడు. ఒక రాత్రివేళ మెలకువ వస్తే లేచి కూర్చొని మళ్లీ లాపుస్తకాలు తిరగేస్తూంటాడు. ఆగదిలోనే తన జీవితరహస్యమంతా దాచబడినట్టూ, తన ఆశయసిద్ధికై ఆ సమాధికన్న ఇంకోమార్గం లేదన్నట్టూ అతను ప్రవర్తించటం ఆమెకు కొత్తకాదు. అలాటి తన భర్తకు తీరుబడి వుంటుందని ఆమె ఎలా అనుకోగలదు?

"మేం వెళ్తాం" అంటున్నాడు కుర్రాడు.

మొదటినుంచీకూడా తనకు ఏవస్తువైనా కావాలంటే, ఏకోర్కయినా తీరాలంటే—తన మామూలు పాటను ఎక్కువగా పాడి, యీ మెత్తని తలిదండ్రుల దగ్గర్నుంచి ఏవిధంగా పొందాలో కుర్రాడికి బాగా తెలుసు. అందుకనే, ఇక విధిలేక, ఆమె "సరే ... వస్తాను, ఉండు" అని లోనికి వెళ్లింది.

ఆమె తిరిగివచ్చేప్పటికి కుర్రాడు గదిలో లేడు. బైటికి రాగానే ఆమె ఆశ్చర్యపడ్డది. కుర్రాడు డ్రైవరుభుజాలమీద ఎక్కి, హారన్ వాయిస్తూ, స్టీరింగు తిప్పుతున్నాడు.

ఆమె కోపంతో "సరిగ్గా చూచోలేవూ ?" అంది.

కాని వేణు తన స్థానాన్ని చూడమన్నట్టు, డ్రైవరుభుజాలమీద సవారీచేస్తూ నవ్వుతున్నాడు.

"నీకే చెప్పేది!"

ఆ 'నీకే' అనే మాటను ఆమె ఎవరిపరంగా ఉపయోగించిందో కాని, డ్రైవరుమాత్రం దానికి వెంటనే చలించి, కుర్రాణ్ని ఎత్తి వెనుక సీటులో కూర్చోపెట్టాడు.

ఆమె ఏమనేందుకూ సాహసించలేక, పెదిమలు బిగపట్టుకొని కుర్రాడిపక్కనే కూర్చుంది.

"ఎక్కడికి అమ్మగారూ?"

"బీచికి—" విసురుగా సమాధానం చెప్పి, ఆమె పక్కకు చూడసాగింది. కారు బయలుదేరింది. ఆమె భరించలేనంత వేగంతో కారు పోతూన్నా, అతనితో మాట్లాడాల్సి వస్తుందని, ఊరుకుంది.

కారు సముద్రతీరాన ఆగింది. కాని మనుషులు పోగై, రేడియో వింటూనో, పప్పులు తింటూనో — గాలి పీలుస్తూ ఆనందించే మామూలు స్థలం కాదది. ఊరిబైటగా వున్న సముద్రతీరప్రదేశం. కారు ఆగగానే ఆమె ఉలిక్కిపడి, "పోనీ—" అంది.

"ఇదే బీచ్"

ఈమాట వినగానే కుర్రాడు సంతోషంతో సముద్రం ఒడ్డుకు పరుగెత్తుకువెళ్లి ఒక్కడూ పిచ్చికగూళ్లను కట్టే సన్నాహంలో ఉన్నాడు.

ఆమెకు అతని సమాధాన మేమీ బాగుండలేదు. అంది: "ఇదా? ఇక్కడ మనుషు లెవరూ లేరే?"

"మనం మనుషులం!"

ఆమె నివ్వెరపోయింది. అత నన్న మాటకన్న అతని కంఠధ్వనే ఆమెకు కఠోరంగా వుంది.

"ఏమిటీ?" అంది, ఆశ్చర్యాన్ని తగ్గించుకుంటూ.

"మనం మనుషులమేగా?"

తనను ఇంత తేలిగ్గా తీసుకునే ధైర్యం అతనిలో వుంటుందని ఆమె కలనైనా ఊహించలేదు. తనతోటా సరసం? అతనికి మతేమన్నా పోయిందా? పిచ్చివాడా? తనదగ్గర నెలజీతానికి పడివున్న డ్రైవరు—తన మాటను ఆజ్ఞగా శిరసావహించాల్సిన ఇతను ఇలాగా మాట్లాడటం ?

ఆమె ఎంతో కోపాన్ని తెచ్చుకోవాలని ప్రయత్నిస్తోంది. కాని, ఆమెకోపంకన్న ముందుగానే అతని మాటలు బైటపడినయ్.

"నన్ను గుర్తుపట్టావా కల్యాణీ?"

ఆశ్చర్యంతో ఆమెవాక్కు మూగవోయింది.

"నేను...శర్మను; నా పెద్దపేరును కత్తిరించి నువ్విచ్చిన చిన్నపేరునే వ్యవహరించుకుంటూన్న నీ పాతస్నేహితుణ్ని! పన్నెండుసంవత్సరాల వెనుక... ఒక వ్యక్తిని–ఇంకా గుర్తురాలేదా?"

ఆమె కొన్నినిమిషాలవరకూ శిలాప్రతిమ అయిపోయింది. అతను వైవిధంగా మాట్లాడేందుకు కారణం ఆమెకు అర్థమవసాగింది. మెల్లిగా పన్నెండేళ్ల నాటి చరిత్రను జ్ఞాపకంచేసుకునేందుకు ప్రయత్నించింది. ఔను...పన్నెండేళ్లనాటిమాట: ఆస్నేహితం తనెల్లా మరిచిపోగలిగిందోకూడా ఇప్పుడు తనకు ఆశ్చర్యంగానే వుంది...శర్మవైపు ఒక్కసారి పరీక్షగా చూసింది—ఎంత మారిపొయ్యాడు! ఆనాడు- మర్నాడు తన వివాహమనగా విశాలప్రపంచంలోకి, ఎవరికీ తెలియకుండానే వెళ్లిపోయి యీనాడు ఇంతమార్పుతో ఇక్కడ తేలాడు! కాని మళ్లీ తన జీవితంలో అతను ఎదురౌతాడని ఎన్నడూ ఊహించనైనాలేదు.

జీవితంచేత ఓడించబడి, నిరాశలకు కుంగికూడా, ఏదో చెప్పుకోలేని, కనీసం ఊహించుకోలేని ఆశలతో లోకం ఒత్తిళ్లకు వాడిన అతని ముఖం! ఆరోగ్యం కూడా చెడినట్టు సాక్ష్యమిచ్చే అతని కళ్లు! 'బతకటం దేనికి?' అన్నట్టు పరుసుగా చూసే అతని చూపు!—ఎంత మార్పు?

ఇంతవరకూ యీశర్మమీద ఆమెకు కలిగిన నిర్లక్ష్యతంతా ఎగిరిపోయింది. కారణంలేని ఆమె భయంకూడా పోయి, దాని స్థానంలో సకారణమైన కొత్తభయ మొకటి లోతుగా పాతుకుపోయింది.

ఒకనాడు అతను–తన జీవితపుటాశలన్నింటినీ తన చేతిలో చిక్కించుకొని, తనకు అందని కొమ్మకు వెళ్లిపొయ్యాడు. తనెలా బతకాలో అర్థంకాక బాధపడ్డ ఆ నాలుగుసంవత్సరాలూ ఎలా గడిచయ్యోకూడా ఇప్పుడు చెప్పలేదు...కాని అది తనకు కనిపించకుండా ఎక్కడో ఆహృదయంలోనే రహస్యంగా దినదినాభివృద్ధయి–ఈక్షణాన ప్రదర్శించిన ఆ భయంకర రూపమే ఆమెభయానికి కారణం.

ఆమెగుండె తను లెక్కపెట్టలేనంత వడిగా కొట్టుకోసాగింది. ఆ హోరు సముద్రుడిదో, తన హృదయానిదో కూడా ఆమెకు తెలియటంలేదు.

"జ్ఞాపకం లేదా?" అన్నాడు శర్మ మళ్లీ.

ఆమె యీలోకంలోకి దిగి, మెల్లిగా తలెత్తి చూసింది. కాని, సమాధానం చెప్పే ధైర్యం ఆమెకింకా కలగలేదు.

"ఎందుకు జ్ఞాపకముంటుందీ? ఒకనాడు నా పాదాలదగ్గర పడి, ప్రకృతి లిఖించిన ప్రేమభిక్షకోసం వేడుకున్నదానివి! ఇప్పుడు నేను నీ పాదాలదగ్గరి సేవకున్నయ్యాను...రోజు లెంతపని చెయ్యలేవు! ఈ అత్యున్నతస్థానాన వున్న నీకు, అధఃపాతాళాన వున్న నేను కనిపిస్తానా?"

నవ్వుతున్నాడు—నిర్లక్ష్యంగా. ఆనవ్వు ఆమె శక్తులన్నింటినీ కదిపింది. పన్నెండేళ్లనాటిజ్ఞాపకాలన్నీ ఆమెకళ్లల్లో మెరిసి, మూలమూలలనుంచి తను ఎనిమిదేళ్లుగా ఎరగని కన్నీటిని కూడబెట్టుకొస్తున్నాయ్.

సముద్రంవైపు చూసింది — కుర్రాడు తయారుచేసిన పిచ్చికగూటిని సముద్రపుటల మింగేసింది. వాడు అంతటితో ఆశ వదలక కొంచెం ఇవతలికి వచ్చి మళ్లీ గూడు కట్టుకునే ప్రయత్నం చేస్తున్నాడు. తన జీవితం కూడా అలాటి ప్రమాదమైన సముద్రపుటొడ్డునే వుంది; ఒకనాడు సౌఖ్యపడదామని ఆ ఒడ్డున మేడలు కట్టుకుంది. కాని లోకమో, తన రాతో ఆ మేడల్ని మింగికూర్చుంది. ఆ సమయాన, ఆ విచారంలోకూడా ఆమె పట్టు విడవక ఇంకో ప్రదేశానికి మారి మళ్లీ ఆశాసౌధాల్ని నిర్మించుకుంది. ఇవి మొదటిసారికన్న జాగర్తగానూ, అనుభవపూర్వకంగానూ కట్టుకున్నవనీ, వీటి కిక చలనం వుండదనీ ఆమె అపోహపడ్డది. కాని యీ క్షణానికి మళ్లీ యీశర్మ ఒక పెద్ద అలగా తయారై ఏళ్లపర్యంతమూ స్థిరంగా వున్న తన మనశ్శాంతిని బెదిరిస్తున్నాడు. ఎప్పటికప్పుడు నిర్మించుకునే ఆశతో ఆమె వాటి భద్రతకు జాగర్తపడాలి.

కుర్రాడికి విసుగుపుట్టి తల్లిదగ్గరికి పరుగెత్తుకొచ్చాడు. ఇప్పటికీ ఆమెకంటినుంచి నీరు కారుతోంది. కుర్రాడి రాకను ఆమె చూసినట్టయితే తన బాధను వాడికి తెలియకుండా చేసుకునేది.

వాడు ఇసుక చేతుల్ని దులుపుకుంటూ, "అమ్మా! ఏడుస్తావెందుకూ?" అని అడిగాడు. ఇంతవరకూ తల్లి ఏడవటాన్ని వాడు చూడలేదు. ఏడుపనేది చిన్నతనంలో తనలాటి కుర్రాళ్ల కుండాల్సిన లక్షణమనీ, పెద్దవాళ్లు ఎన్నడూ ఏడవనే ఏడవరనీ వాడి అభిప్రాయం.

ఆమె చప్పున తేరుకొని, కన్నీళ్లు తుడుచుకుంది. తల్లి సమాధాన మివ్వకపోవటం చూసి, కుర్రాడు సాలోచనగా డ్రైవరువైపు చూశాడు. కాని డ్రైవరు మొహంతప్పించి, సముద్రుడు ఆకాశంతో స్నేహం సంపాయించుకోగలుగుతూన్న ప్రదేశంవైపు చూస్తున్నాడు.

"ఏమమ్మా?" అన్నాడు కుర్రాడు మళ్లీ.

దుఃఖంతో పూడుకుపోయిన గొంతును సరిచేసుకుంటూ, "ఏం లేదు నాయనా! కంట్లో ఇసుక పడ్డది — ఇక వెళ్దామా?" అంది.

కుర్రాడు యీ మాటను నమ్మాడు. తల్లి కేదో కష్టంగా వుందని చప్పున కారెక్కి కూర్చొని "పోనీ" అన్నాడు. కారులో కల్యాణి కుర్రాణ్ని తన ఒళ్లో కూర్చోపెట్టుకొని, వాడి తలమీద తన గడ్డాన్ని ఆనించి కళ్లతో ఎవర్నో, దేనికో ప్రార్థిస్తోంది. కారు ఇంటికి వచ్చేటంతవరకూ శర్మేమీ మాట్లాడలేదు కాని, ఆమె బాధపడట మంతా ముందున్న అద్దంలో చూస్తూ అర్థం చేసుకుంటూనే వున్నాడు.

కల్యాణి బాగా చీకటిపడేవరకూ భర్తఎదుట పడకుండా ఎలాగో తప్పించుకు తిరగగలిగింది.

## 3

ఆ రాత్రి ఆమె పడుకుందన్నమాటేకాని, ఆ పక్కలో మెత్తదనమే లేదు. ముళ్లమీద పడుకున్నట్టనిపించింది. చాలాసేపటివరకూ అటూ ఇటూ దొర్లి, తరువాత పక్కలో లేచి కూర్చొని తరగని ఆలోచనలో పడ్డది.

శర్మ! ఒకనాటి తన ప్రియుడు శర్మ! లోకమూ, విధీ అనుకూలంగా ఉన్నట్టయితే, తను యీ డ్రైవరు భార్యకావాల్సింది! ఆశర్మ మళ్లీ తనకు ఎదురయ్యాడు. విధి ఎంత కఠినమైంది! అసలు అతను తనకు జీవితంలో కనిపించకపోయినట్టయితే—మృత్యువువాత పడివున్నట్టయినా తన కీబాధ తప్పేది! కనిపించినవాడు తనను తాను ఎరుకపరుచుకోకుండా వున్నా సరిపొయ్యేది. కాని అతను సరిగ్గా త నేవిషయమై బాధపడగలదో—ఆవిషయాన్నే అమితగురితో కొట్టాడు.

పన్నెండేళ్లలో శర్మ ఎంత మారిపొయ్యాడు! ఏరోజు కారోజు తనకు తెలియకుండానే తనుకూడా పూర్తిగా మారిపోయిందేమో? ఈనాడు అతనిపైన తను ఎంత అధికారాన్ని చలాయించింది! ఏమనుకున్నాడో? బాధపడ్డాడుకాబోలు! ఇంకా బాధపడుతూనేఉన్నాడేమో? తన హృదయంలో తన ఎరుక లేకుండానే ఎంత కరుకుదనం అణిగివుంది!

ఆరోజులు - సంవత్సరాల వెనకటి రోజులు - అవి తన జీవితంలో మధురతమదినా లని భ్రమపడ్డ రోజులు! ఆ వెన్నెలరాత్రులు — నిద్రాముద్రితలోకాన్నంతట్నీ మోసం చెయ్యగలిగా ననే ధీమాతో, అనధికారంగానైనా సౌఖ్యాన్ని అనుభవించగలుగుతున్నా ననే తృప్తితో — పరిణామ మేమో ఆలోచించేందుకైనా వ్యవధిలేని సంతోషంతో నిండిన హృదయంతో గడిపిన కమ్మటి రాత్రులు! బీదరికానికీ, సౌఖ్యానికీ లంకె లేదనే న్యాయాన్ని గ్రహించిన ఆరోజులు ఎలా మరిచిపోగలిగింది తను?

"శర్మ మంచివాడు" అనీ, "శర్మ అందమైనవాడు" అనీ, "శర్మ బాగా పాడగలడు" అనీ ఇరుగుపొరుగు అమ్మలక్కలు అనుకుంటూంటే తను విని ఆనందపడ్డ రోజు లవి! శర్మమినహాగా లోకమే లేదనే అభిప్రాయపడ్డ దినా లవి! అప్పుడు అంత ప్రేమపాత్రుడైన శర్మ నిజంగా యీనాడు తన కన్నెర్రకు ఎలా గురికాగలిగాడు? నిజంగా అతన్ని తను ప్రేమించిందా? ప్రేమించగలిగిందా? ప్రేమిం

చకపోయినట్టయితే - ఒకనాడు కాదు, రెన్నాళ్లు కాదు – నాలుగువసంతాలపాటు అహోరాత్రాలూ తన ఆశలన్నీ ఇంకిపోయినట్టు ఎలా బాధపడ్డది! జీవితం ఎంత వింతవస్తువు!

ఆతను మాయమైనప్పటినుంచీ, తను కాపరానికి వచ్చిన ఆర్నెల్లలోనూ, తన ప్రియసఖులు, తన మూలానే శర్మ పిచ్చివాడై దేశాలపాలయ్యాడని అనటాన్ని అనేకసార్లు తను విన్నది. ఒకప్రాణిజీవితాన్ని – తనహృదయాన్ని అర్పించుకున్న మానవుడి బతుకును పాడుచేసిన తన రాక్షసత్వాన్నిగూర్చి ఆమె ఆడిపోసుకుంది. శర్మఅభివృద్ధికై వేయిదేవుళ్లకు మొక్కుకున్న రోజులు అనేకం వున్నయ్.

అలాటి జీవితాన్ని కాలచక్రం తనకు తెలియకుండానే మెల్లిగా వెనక్కు నెట్టేసి, తనకు బదులు ఆనందాన్నిచ్చి మనశ్శాంతిని ప్రసాదించింది. కాని యీనాడు పట్టబలవంతాన ఆతలపుల్ని ఎంత తొక్కిపెడదామన్నా ఆమెకు సాధ్యమవటం లేదు. అనుకోకుండా జరిగేవి అనుకుంటే జరగవుకాబోలు!

ఈ ఆగని ఆలోచనలు ఆమెవెచ్చనికన్నీటిని పరీక్షించుకుంటున్నయ్. బాధతో కార్చిన కన్నీరెరిగి ఆమెకు ఎనిమిదిసంవత్సరాలైంది! మళ్లీ అది యీనాడు!— తనెందుకు బాధపడటం? ఎవరికోసం? ఇన్నివసంతాల వెనుకటి జీవితాన్ని మరిచిపోతే ఎంత బాగుండును!

గడియారం పన్నెండుగంటలు కొట్టింది. ఆమె చప్పున ఆశబ్దంతో తన స్థితిని తెలుసుకొని, ఇలా ఆలోచించటం అనవసరంగా తనకు తను బాధను కొనితెచ్చుకోవటమే అవుతుందని ఎలెక్ట్రిక్ లైటు ఆర్పి గట్టిగా కళ్లు మూసుకొని పడుకుంది. కాని ఆమెకది కష్టంగా తోచి, వెంటనే కన్ను తెరిచింది. గదినంతట్నీ ఆక్రమించుకున్న చీకటిలో ఆమెకు భయం వేసింది. ఎవరో తనను కనపడని తావుల్నుంచి ఒత్తిడిచేస్తూన్నట్టనిపించింది. పైని కప్పుభారమంతా తనే మోస్తూన్నట్టనిపించింది. ఆస్థితిని భరించలేక, వెంటనే మళ్లీ లైటువేసింది.

ఇక తను నిద్రకు నోచుకోలేదు. జీవితంలో అనేకకష్టాలకు గురై, అన్ని ఆశల్నీ వదులుకొని, జీవితంమీద రోతపుట్టి, మృత్యుదేవత శాంతినిమాత్రమే మానవుడు కోరకుండా - ఈచిన్ననిద్రలో ఆబాధల్ని కొంతవరకూ మరిచిపోగలిగేట్టు చేస్తే, తెల్లారగానే మళ్లీ తనతోడి ఆటకు కొత్తగా తయారౌతాడని విధి ఏర్పరిచిన యీనిద్ర! కాని తన శర్మనుగూర్చి ఆలోచించేందుకూ, నిద్రకూ పొత్తు పొసగదు. మరీ యీశర్మ తన కళ్లఎదుట తారట్లాడుతూంటే అతన్ని గూర్చి ఆలోచించకుండా ఉండటం ఎలా సాధ్యం? మరి తన కర్తవ్యం?

ఈశర్మను ఇక్కణ్నుంచి వెళ్లగొడితే? పాపం- తిండికై ఇక్కడకు, తమపంచన జేరినవాణ్ని ఇంకోచోటు చూసుకోమనటం! ఐనా తను అతనిలాటివాళ్లమీద ఎంతమందిమీద తన దయను చూపగలదు? కాని అతను యీప్రదేశంలో లేకపోతే ఎప్పటివలెనే తన మనశ్శాంతి మళ్లీ ఏర్పడుతుంది. అతను వెళ్లకుండా ఇంకేఉపాయమూకూడా లేదాయె. కాని అతన్ని ఏతప్పుమీద, ఏవంకమీద వెళ్లగొట్టగలదు? ఈసాయంత్రమే అతన్నిగూర్చి మంచి అభిప్రాయాన్ని భర్తముందు బైటపెట్టింది. తండ్రీకొడుకులకుకూడా అతనిపైని అభిమానం ఏర్పడ్డది. మరి ఇంకేకారణాన్ని తను చూపాలి?

“ఇంకా నిద్రపోలేదా?”

ఆమె ఉలిక్కిపడ్డది. భర్తవైపు తిరుగుతే వెలవెలపోతూండే తన ముఖాన్ని అతను గుర్తిస్తాడేమోననే భయంతో, వేరొకదిక్కు చూస్తూ సమాధానం ఇచ్చింది: “లేదు...తలనెప్పిగా వుంది—మీరో?”

“నేను రాసుకుంటున్నాను...మందేమీ వాడలేదా?”

“వాడాను—తగ్గుతోంది. కొస్త ఆగి పడుకుంటాను”

భర్త తిరిగిపోతూన్న అడుగులచప్పుడు వినేదాకా వెనక్కు తిరిగిచూసే ధైర్యం ఆమెకు కలగలేదు. పక్కనే మంచంమీద కుర్రాడు, తన కీలోకంతో యీసమయంలో ఏమీ పట్టనట్టు హాయిగా

నిద్రపోతూన్నాడు. తనను "ఎందు కేడుస్తున్నావమ్మా?" అని అడిగిన ఏకైకప్రాణి! జీవితంలో పెద్దపెక్షుల సమయా లున్నాయ్యని వాడి కింకా తెలియదు. తన తల్లిఅందమైన పెద్దకళ్లు తన ఆటల్ని చూసి ఆనందించేందుకని భ్రమపడుతున్నాడుకాని, హృదయారాటాన్ని వెలిబుచ్చుకునే కన్నీటికని వాడు ఎరగడు. ఎంత అమాయకుడు!

తనకు కావాల్సింది సాధించేందుకు కాస్సేపు తల్లిదండ్రులదగ్గర రాగాలాపన చేస్తే వాడి కోరిక తీరుతుంది. కాని తను, తనలాటి నిర్భాగ్యమానవులు — ఆవిధిముందు బతుకంతా ఏడుస్తూ కూర్చున్నా జీవితంలో కావాల్సింది రాదనే సంగతి వా డసలు ఊహించగలడా?

ఇప్పటికి దాదాపు తెల్లవారుజా మయింది. కుర్రాణ్ని తనపక్కమీదికి లాక్కొని, నీటిలో పడ్డ వ్యక్తి చేతికి దొరికిన కర్రను వదలనట్టు వాడిమీద చెయ్యి వేసుకొని, లైటుతీసే ధైర్యం లేక అలాగే పడుకుంది. ఎప్పుడు నిద్రపట్టిందోకాని, తెల్లారి కుర్రాడు లేచి "లైటు వెలుగుతోందమ్మా!" అనేదాకా ఆమెకు తెలివి రాలేదు.

౪

తనెవరో కల్యాణికి తెలియపరుచుకున్న క్షణం నుంచీ శర్మకూడా అనేక కొత్తసమస్యల్ని ఎదుర్కొన్నాడు. ఆమెకన్న అతను తక్కువగా మనశ్శాంతిని పోగొట్టుకున్నా డనేందుకూడా వీల్లేదు.

కల్యాణి! ఏ మధురమూర్తిని భార్యగా చేసుకొని, జీవితమంతా సౌఖ్యపడదామని ఓడిపొయ్యాడో, ఏ ఓటమితో తను దారం తెంచుకొని గాలికరుణకు వదలబడ్డ గాలిపటంలాగు లోకంలో ఒకమూలనుంచి ఇంకోమూలకు తరుమబడుతున్నాడో, ఏస్త్రీకోసం తనను తను గుర్తించుకోలేక లోకులు కనిపెట్టలేని పిచ్చివాడయ్యాడో—ఆకల్యాణి యీనాడు తనకు యజమానురాలు! పూర్వం తను ఆరాధించింది యీకల్యాణినే. కాని ఆమెహృదయంలో స్థానాన్ని ఏర్పరచుకొని ఇద్దరి మధ్యా భేదం లేదనే గాఢనమ్మకంతో పూజించిన స్త్రీ ఆమె! కాని యీమెను, విలువైన దుస్తులున్నంతమాత్రాన, తనను పోషిస్తూన్న వంకమీద, తన సేవను తనకు ఇష్టంలేకున్నా దబాయించి పుచ్చుకోగల మనిషిని ఆరాధించవలసివచ్చింది. తనతోడి స్నేహాన్ని ఆశించి, ఇంత విశాలప్రపంచంలో తనొక్కడే అర్హుడయినట్టు, తన వ్యక్తిత్వ మొక్కటే తను కోరే జీవితపు కోర్కెఅయినట్టు ప్రవర్తించిన ఆడుదాని దగ్గర సేవ! విధి ఇంతకన్న కఠినరూపాన తనకు కనపడలేడేమో?

కల్యాణికీ, తనకూ మధ్య వున్న ప్రతి చిన్న భేదమూ అతన్ని బాధించసాగింది. ఆమెగౌరవమూ, ఆమె హాయిగా బతకటమూ, ఆమెఐశ్వర్యమూ, చివరికి ఆమెస్త్రీత్వమూకూడా అతనికి భరించరానిదైంది. దీని ఫలితంగా ఆమెమీది ప్రేమంతా వెంటనే రంగు మార్చుకొని ఈర్ష్యరూపాన తయారైంది. తనకే పరిస్థితులు అనుకూలించినట్టయితే — కనీసం యీఒక్క కల్యాణి తనమాటను తోసేసిఉండకపోయినట్టయితే— ఆమె ఈసరికి తన భార్యఅయి తనతోడి అదృష్టాన్నీ, దురదృష్టాన్నీ పంచుకొని, తన రాకకోసం ఎదురుచూస్తూ, తన అడుగులకు మడుగులొత్తుతూ చచ్చిపడివుండాల్సింది. ఆకుర్రాడితో తనకు యీనాడు కలిగిన ఆ ఆనందమంతా తన స్వపుత్రుడిమీద కలిగివుండాల్సింది! ఈకల్యాణి తనకు మాయమైనట్టే కనిపించి, యీనాడు అందనికొమ్మన కూర్చొని తన మొహంలో నవ్వినట్టనిపించింది.

రాత్రంతా ఆమెగదివైపే చూస్తూ కూర్చున్నాడు. ఆమె గట్టిగోడలవెనుక పడే బాధను అతను ఊహించలేకపొయ్యాడు. ఆమె ఎందుకు బాధపడుతుంది? చావు అనేదానికికూడా తనకు నివాసయోగ్యమైన స్థానాలు తెలుసు. ఆకప్పుకింద తన జీవితాన్నే స్వర్గంగా మార్చుకుంటూ బతుకుతోంది. తన సంగతే ఆమె తలిచిఉండదు. ఆ అవసరంమాత్రం ఆమెలాటి ఉత్తమవంశ్యురాలికి ఎలా వుంటుంది? తన జీవితాన్ని నేలపాలు చేసిన కల్యాణి! ఇన్నాళ్లుగా తను గ్రహించలేని విషయమంతా అతనికి కల్యాణిలో యీరోజున స్పష్టంగా కనిపిస్తోంది. కాని తను మాన

వుడై — ఏమీ చేతకాని దద్దమ్మలాగు ఉండగలడా? ఆమెను — తన అందానికి, తన సౌఖ్యానికి గర్వపడుతూన్న ఆమెను—తనతోపాటే కిందికిలాగి బాధించాలి! అంతవరకూ తనకు మనశ్శాంతి ఉండటం కల్ల! ఆమె సౌఖ్యంకోసం ఒకనాడు తను చేసిన, చెయ్యగలిగిన త్యాగం తన కెంత నష్టమయిందో, ఆమెకు ఎంత లాభమయిందోకూడా ఆమె తలచలేని స్థితిలోకి వచ్చింది.

ఆ రాత్రంతా మేలుకొని శర్మ ఆలోచించిన దానికి ఫలితం—బుసలుకొడుతూ కల్యాణివెంట పడి, తను అనవసరంగా ఇన్నాళ్లూ పడిన బాధలకు ప్రతిఫలంగా ఆమెను తన అదుపాజ్ఞల్లోకి లాక్కోవాలనే నిశ్చయంగా తయారైంది.

మర్నాడు మధ్యాహ్నం—

కల్యాణి ఎందుకోగాని కిటికీలోంచి ఒకసారి కారుషెడ్డువైపు చూసింది. శర్మ దాసీదాని పైట పట్టుకొని లాగుతున్నాడు. అది నవ్వుతూ, నసుగుతూ వేళాకోళ మాడుతోంది. తరువాత ఇద్దరూ కారు షెడ్డులోకి మాయమయ్యారు.

ఆమెఒళ్లు మండింది. శర్మ ఎంత చౌకబారు మనిషిగా తయారయ్యాడు! ఎంత నీచుడు! లోకంలో ఏకాకై బతుకుతూకూడా, లోకాన్ని చూసి భయపడకపోవటమేమిటి? తన శర్మ—అంతకన్న గొప్ప పురుషుడు తన కీ భూమిమీదనే దొరకడనుకున్న శర్మ— ఇలా మారుతాడని తను కలనైనా తలవగలదా?

—కాని తనకు అతనిమీద యీ క్షణాన కోప మెందుకు రావాలి? లోకంలో అనేకమంది ఇతర్ల కళ్ల ఎదుట, కనీసం ఇతర్లకు తెలిసేట్టయినా చేసే నీచకార్యాల్ని గూర్చి ఆలోచించేవాళ్లయినా లేరే! మానవుడు చేసే పనినే ఈ శర్మ చేస్తే తన కెందుకు యీ బాధాకరమైన ఆలోచన రావాలి? శర్మ ఎవరో, తనెవరో— అతనిమీద తన కెందుకు ఈ యీర్ష్యతో కూడుకున్న జాలి? ఆమెకు ఎంత ఆలోచించినా యీ ప్రశ్నకు సమాధానం తెలియలేదు.

ఏది ఎట్లా వున్నా శర్మను వెళ్లగొట్టటం చాలా ఉత్తమమైన పని. అందుకు యీ దాసీదాన్ని అడ్డంపెట్టి పన్నాగం పన్నుతే? కాని శర్మ తనకు కనబరిచిన నీచతను ఇతర్లకు చూపటానికి ఆమెకు ఎందుకోగాని మనస్సు ఒప్పలేదు. శర్మను డ్రైవరురూపాన జీతానికి కుదుర్చుకున్నారు కాని, ఆ మిగిలిన అతనిలోని మనిషితో తమకు సంబంధం అనవసరమే! అదీ కాక, శర్మ ఇంట్లో అందరి అభిమానాన్నీ సంపాయించగలిగాడు. తను కిందిసాయింత్రమే శర్మను మంచివాడుగా భర్త యెదుట పేర్కొంది; ఈనాడు మళ్లీ తన సిద్ధాంతానికి విరుద్ధంగా మాట్లాడటం తనను తను పిచ్చిదానిగా చేసుకోవటమే! భర్త తనను ఒక్కసారిగా నమ్మలేడేమో కూడా! కుర్రాడు మామూలుగా తన ఆబల్ని డ్రైవరుతో సాగిస్తూన్నా, శర్మకు భయపడి ఆమె వాణ్ణి పిలవటంకూడా మానుకుంది.

పోనీ, తనే కొన్నాళ్లపాటు యీప్రదేశం వదిలిపెడితే? వదిలి ఎక్కడికి వెళ్లేట్టు? ఈ వూరు వచ్చేముందే రెండు నెలలపాటు పుట్టింట్లో గడిపి వచ్చి, మళ్లీ ఇప్పుడే అక్కడికి వెళ్తానంటే అర్థముండదు. అసలు ఇంత సౌఖ్యానికి అలవాటుపడ్డ తన ప్రాణికి ఆ బీదకొంపలో హాయికూడా లేనిమాట నిజం.

ఆ సాయింత్రం—

భర్తబలవంతంమీద, అతనితోపాటే షికారు వెళ్లింది. కారు కిందటిసాయింత్రం ఆగిన ప్రదేశాన్నే ఆగింది. ఆ ప్రదేశాన్ని చూసేప్పటికే ఆమెకు గతించిన బాధాకరమైన ఆలోచనలన్నీ ఒక్కసారి జ్ఞాపకమొచ్చినట్టయింది అప్రయత్నంగా ఆమె లోలోన ఒణకసాగింది.

ఆమెకు శర్మవైపు చూసే ధైర్యంకూడా లేదు. భర్త చెయ్యి పట్టుకొని తన నెవరో లాక్కుపోతారన్నట్టు, ఎంతసేపటికీ అతని దృష్టిలోనే సంచరించేందుకు ప్రయత్నించింది. కుర్రాడు కట్టే పిచ్చికగూళ్ల అందాన్ని భర్తలాగు తను గ్రహించలేకపోయింది. ఆమెలో పనిచేసే ప్రశ్న ఒక్కటే: "శర్మను గూర్చి నే నేం చెయ్యాలి?"

ముగ్గురూ మళ్లీ తిరిగి వచ్చేప్పటికి శర్మ స్టీరింగుమీద తలవాల్చి నిద్రపోతున్నాడు. మూసి

వున్న అతని కళ్లనుంచి రెండుమూడు నీటిబిందువులు కింద పడేందుకు సిద్ధంగా ఉన్నయ్.

ప్రసాద్ ఇది చూసి, భార్యనూ కొడుకునూ అవతలికి తీసుకువెళ్లి, "అతను లేచేదాకా, కాస్సేపు కూర్చుందాం" అన్నాడు. కుర్రాడు మళ్లీ తన ఆట ప్రారంభించాడు.

ప్రసాద్ ఒకసారి జాలిగా కారువైపు చూసి, "నిర్భాగ్యుడు! ఒకప్పుడు బాగా బతికినట్టున్నాడు. ఏనాటి ప్రియురాలిన్నో తలుచుకొని ఏడుస్తున్నట్టుంది." అన్నాడు.

కల్యాణి యీ మాటకు తనకు తెలియకుండానే కంపించింది. భర్తకుకూడా తన రహస్య మేమిటో తెలిసిపోయిందనే కొత్తభయ మొకటి ఆమెకు కలిగింది. వెంటనే ప్రసంగం మార్చేందుకు, "చదువు లేక కుర్రాడు చెడిపోతున్నాడు –" అంది.

"ఔను ... నేనూ అదే ఆలోచిస్తున్నాను. త్వరలోనే ప్రైవేటుమాస్టర్ని కుదర్చాలి."

ఆ విధంగానన్నా కుర్రాడు శర్మబారినుంచి బైటపడతా డనే ఆమె కొక తృప్తి! నీలాకాశం అంతులేని సముద్రపునీటిలో తన పాపను చూసుకుంటూన్నా, ఆమెకు ఆనందం కలగలేదు.

✂

వసిపట్టి అతిప్రయాసకు ఓర్చి చాలా దూరంనుంచీ తరుముకువచ్చి తన ఆహారంకోసం ఆత్రుతపడుతూ కాచుకుకూర్చున్న వన్యమృగంలాగు–శర్మ కల్యాణితో మాట్లాడే సందర్భంకోసం ఎదురుచూడసాగాడు. ఆమె ఇదివరకులాగు బైటకనిపించటం మానేసింది. రోజులో హఠాత్తుగా ఎప్పుడో రెండు మూడుసారులు మెరుపు మెరిసినట్టు కనిపించీకనిపించకుండానే మాయమయ్యేది. కుర్రాడుమాత్రం ఆటలకు విడువకుండా వస్తున్నాడు. తన కసలు ఆ ఆటలమీద ఉత్సాహం క్షీణించినా, కుర్రాడిద్వారా కొంత ఇంటిగుట్టు తెలుస్తుందనే అభిప్రాయంతో శర్మ ఉత్సాహాన్ని నటించసాగాడు.

మధ్య మధ్య, "అమ్మగారు కోప్పడతారు" అనేవాడు—ఆ 'అమ్మగారు' తన కెంత ముఖ్యమో తెలియజేస్తున్నట్టు.

"ఫర్వాలేదు."

"అమ్మగారు ఏం చేస్తున్నారు?"

"చదువుకుంటోంది" అనో, "పడుకుంది" అనో సమాధానం వచ్చేది. ఇంతకన్న విడమర్చి యీ కుర్రాడిద్వారా తెలుసుకోవాల్సిందికూడా శర్మకు కనిపించలేదు.

పోతే, దాసీదానిద్వారా తనకు అందే వార్త – "కూర్చున్నారు; ఏదో ఆలోచిస్తున్నట్టున్నారు". ఆ ఆలోచన దేన్నిగూర్చో తెలుసుకోవాలని శర్మకు వుందికాని, గట్టి శరీరం వొకటి అడ్డమవటంవల్ల అది సామాన్యమానవుడైన శర్మకు అతీతమైంది.

దాసీదానిదగ్గర్నుంచికూడా తన గుట్టు బైటపడకుండా ఇంతకన్న విశేషాలు లాగటం శర్మకు సాధ్యపడటం లేదు. రాత్రిళ్లుమాత్రం ఆమె గదివైపే చూస్తూ కూర్చునేవాడు. బాగా పొద్దుపొయ్యేవరకూ గదిలో లైటు వెలుగుతూనే వుండేది. లోపల జరిగే నాటకాన్ని అతను తన ఊహకు తోచినట్టుగా ఆలోచిస్తూండేవాడు. ఆ గట్టిగోడలవెనుక వున్న ఆ లైటే తనకు అందరాని వస్తువయినట్టు, దానితోపాటే తనూ మేలుకోవటం నేర్చుకున్నాడు. పిచ్చిశర్మకు గదిలోంచి నవ్వు వినిపిస్తూన్నట్టనిపించేది. ఆమె ఆనందిస్తోందన్న తలపు వచ్చినప్పుడల్లా అతని గుండె మండిపడేది. వెంటనే తన జీవితంలో ముప్ఫయినాలుగు వసంతాలు గడచిపోయినసంగతి ఇప్పుడే తెలుసుకున్నట్టుండేది. తనకు ఏ మంచి అనుభవమూ లేకుండానే జీవితం పూర్తికాబోతోంది కాబోలు! ఇప్పటికైనా తను మేలుకోకపోతే – ఇక లాభం లేదు! ఒకోక్క సమయాన – ఏనా కిటికీదాకా వెళ్లి గదిలోకి ఒక్కసారి చూద్దా మనిపించేది! కాని శర్మకు దమ్ములు చాలేవికావు!

శర్మ రాత్రిళ్లుకూడా కారుషెడ్డులోనే పడుకుంటున్నా డన్న సంగతి తెలుసుకున్నప్పటినుంచీ

కల్యాణి తనకు కనపడని దయ్యమేదో తనను ఎల్ల వేళలా వెన్నాడుతూన్నట్టు భయపడసాగింది.

ఒకనాటిసాయంత్రం మెల్లిగా యీప్రస్తావనను భర్తదగ్గర తెచ్చింది.

"అతనికి ఇల్లు లేదా?"

"ఎవరికీ ?"

"డ్రైవరుకు"

"ఏమో—నే నాసంగతి అడగలేదు. ఇల్లుంటే, పాపం, ఇక్కడెందుకు పడివుంటాడు? జీవితంలో పెద్ద దెబ్బ తిన్నట్టున్నాడు—పాపం!"

ఈవిధమైన సానుభూతి అన్నివైపులనుంచీ శర్మ సంపాయించుకోగలగటం ఆమెకు ఏమీ ఇష్టంలేదు. కాని భర్తతో ఏమన్నా గట్టిగా చెప్దామన్నా ఆమెకు నోరాడడం లేదు.

వారంరోజులు గడవకముసుపే కల్యాణి బాగా మారిపోయింది. తల తిరిగిపొయ్యేటంత ఆలోచనా భారమంతా ఆమెముఖంలో ప్రతిఫలించేది. రాత్రిళ్లు ఎక్కువసేపు మేలుకుంటూండటంవల్ల ఆమెమెరిసే కళ్లలో ఎరుపురంగు గొప్పస్థానాన్ని ఆక్రమించుకుంది. దుస్తులు ధరించటంలోనూ, తల దువ్వుకోవటంలోనూ, ఇతరకాలకృత్యాల్లోనూ ఆమెకు శ్రద్ధ తగ్గింది. జీవితంలో ఏ ఇతరవిషయమూ తనదగ్గర ప్రాముఖ్యతను సంపాయించుకోలేదనే అనుమానం ఆమెకు కలగటంలోకూడా ఆశ్చర్యం లేదు. ఎప్పుడూ నిర్లక్ష్యంగా, అన్యమనస్కంగా తన భార్య తిరుగుతూఉండటం ప్రసాద్‌కూడా కనిపెట్టాడు.

ఒకనాడు అడిగాడు: "నీ ఆరోగ్యం సరిగ్గా లేదా?"

"లేకేం ?" అంది—తనకు చేతనైనంతగా నటిస్తూ.

"ఎప్పుడూ పరాకుగా ఉంటావేం?"

"ఏం — లేదు"

"నీ కిక్కడ బాగా లేదు—"

"బాగానే వుంది"

"మరి—?"

ఆమె మాట్లాడలేదు. సమాధానం ఎలా చెప్పాలో ఆమెకు తెలియలేదు.

"ముఖమంతా పాలిపోయింది. కళ్లలో చలాకీతనమే లేదు. బహుశా నీ కీనీళ్లు పడలేదేమో?"

"పడ కేంచేస్తాయ్—కొత్తలో కాస్త ఇదిగా వున్నా—?"

ప్రసాద్ దీనికి కాస్త సమాధానపడ్డాడు. కాని ఏదో బాధతో కల్యాణి మనసు చెడగొట్టుకుంటోందనే అతని అనుమానం తీరలేదు. ఇంతకన్నా నొక్కి అడగటానికూడా అతనికి మనసొప్పలేదు.

"ఎప్పుడూ ఇంట్లో కూర్చుంటావేం? సాయింత్రం కుర్రాణ్ని తీసుకొని షికారు వెళ్లరాదూ?"

తన మనసు బాగుచేసే సాధనాల్లో ఇదొకటని భర్త నమ్మాడు. కాని ఇది తనకు ఎంత బాధాకరమో, ఎందువల్ల తను దీనికి ఒప్పుకునే పరిస్థితుల్లో లేదో ఆమె ఎలా చెప్పుకోగలదు? గత ఐదారేళ్లనుంచీ షికారువెళ్లే తన అలవాటునుకూడా భర్త ఆధారంగా తీసుకున్నాడు.

"ఆ సముద్రపుగాలి నాకు బాగుండదు" అంది. దాంతోపాటే తనకు ఇంకా బాగుండనివి ఉన్నా లేనట్టే నటించాలి. జీవితంలో ఎంత నటన వుందో ఆమెఅనుభవంలోకి మరోసారి వస్తోంది.

"పోనీ, సినిమాకు వెళ్లరాదూ? ... సినిమాకు వెళ్లి చాలారోజు లైందిగా—ఇవ్వాళ వెళ్దామా?"

ఆమెకూడా తన మనశ్శాంతికోసం కొన్ని కృత్రిమసౌఖ్యాల్ని నిర్మించుకోవాలనే చూస్తోంది. ఇప్పుడు భర్తతో కలిసి సినిమాకు వెళ్లటమంటే ఆమెకు లేనిధైర్యం వచ్చింది. 'సరే' నన్నట్టు తల తిప్పింది.

"సాయింత్రానికి ఇద్దరూ సిద్ధంగా ఉండండి" అని చెప్పి ప్రసాద్ కోర్టుకు వెళ్లిపొయ్యాడు.

సాయింత్రానికల్లా ఆమె కుర్రాడితోపాటే సిద్ధమై, భర్తరాకకోసం ఎదురుచూడసాగింది. ప్రపంచంలో తనకు లేని సంతోషాన్ని ఇతర్ల ముఖాన

చూసి, తనుకూడా ఆ లేని సంతోషాన్ని నటించి కొంతవరకూ మనశ్శాంతి సంపాయించటంకూడా సంభవమే ననే ఊహ ఆమెను వదలలేదు.

మామూలువేళకన్న ఆలస్యంగా వచ్చి, ప్రసాద్, "సిద్ధంగా ఉన్నారా?" అన్నాడు. తల్లీకొడుకు లిద్దరూ ఒక్కసారే తలతిప్పారు.

"కాని...నేను వచ్చేందుకు వీల్లేదు కల్యాణీ! రేపటికల్లా తయారుకావాల్సిన రికార్డు చాలా వుంది... ఐనా ఆశాభంగం లేదులే! నువ్వూ, కుర్రాడూ వెళ్లి రండి" అన్నాడు.

చీకట్లో వెళ్లేందుకు—కాదు, శర్మతోపాటు ఒకేకారులో వెళ్లేందుకు ఆమె భయపడ్డది. అసలు ఒంటరిగా ఈగోడలు అడ్డంఉండబట్టి తనకు తనే బాధపడుతోందికాని, బైటనైతే ఇతర్ల బాధకూడా తనను వేధించేదేమో?

"పోనీండి, రేపు వెళ్లవచ్చు; తొందరేం?"

"ఎందుకూ? ఇంత సన్నాహమూ చేసి, ఇప్పుడు ఆగటం దేనికి? నీ కేంభయం? ఇదివరకు నువ్వు ఒక్క తెవూ ఎన్ని సినిమాలకు వెళ్లలేదు?"

కుర్రాడుకూడా ధైర్యం చెప్తూన్నట్టు, "పోనీ, మనం వెళ్దామే!" అని తల్లికొంగు పట్టుకొని లాగ సాగాడు.

విసుగ్గా కుర్రాడివైపు చూసి, "ఏం-రేపు వెళ్లకూడదా?" అంది.

"ఇవ్వాళైతే నేం?"

"బద్ధకంగా వుంది" అని వంకచెప్పింది.

ప్రసాద్ నమ్మనట్టు నవ్వి, "హాలుప్రవేశంతో అంతా పోతుంది" అన్నాడు.

ఆమె సమాధానంకోసం మాటల్ని వెతుక్కుంటోంది; ఒకోక్కసమయాన మాటలకుకూడా కరువంటూ వుంటుందికాబోలు! కుర్రాడు ఇప్పటికే బిక్కమొగం వేసి యీచిన్న ఆశాభంగానికి బాధపడసాగాడు.

ప్రసాద్ కుర్రాడిచెయ్యి పట్టుకొని, "పోనీ, అబ్బాయికోసం వెళ్లిరా" అన్నాడు.

కుర్రాడిముఖం చూస్తే ఆమెకు జాలి కలిగింది కాని—శర్మను చూస్తే కలిగే భయంమాటేమిటి?

"వెళ్లు-ఇప్పటికే ఆలస్యమైంది" అని ప్రసాద్ తొందరచేశాడు.

ఆమెనరా లన్నీ లాగుతున్నయ్. తలవనితలంపుగా వచ్చిన యీసంఘటనకు అనుకూలంగా ఎలా మారాలో ఆమెకు అర్థమవలేదు. భర్తనూ, కొడుకునూ సంతోషపెట్టేందుకైనా వెళ్లాలి! ఒకవిధంగా తనకు తనే ధైర్యంచెప్పుకోసాగింది. ఇంతా ఏదుస్తే శర్మ తనకింద జీతానికి పనిచేసేవాడు; ఈమాటను లోకమంతా అవునంటూ తనపక్షాన పలికేందుకు ఎప్పుడూ సిద్ధంగానేవుంది. అతను తన్నేం చేస్తాడని, అతన్ని చూసి-తన నీడకు తనే భయపడ్డట్టుగా—భయపడాలి?

ఈధైర్యంతోనే భర్తవెనకాలే వెళ్లి కారులో కూర్చుంది. ప్రసాద్ "థియేటర్‌కు పోనీ" అని చెప్పి, ఇంట్లోకి వెళ్లిపొయ్యాడు.

కారు బయలుదేరగానే ఆమెను మళ్లీ క్రమంగా భయం ఆవరించసాగింది. ఆతని కళ్లు! వాటిల్లో సూదంటురాయిగుణముంది. అది ఒక్క స్త్రీలనే కాదు, పురుషుల్నికూడా ఆకర్షించగలదు. ఇందుకు తన భర్తా, కుమారుడే ప్రత్యక్షనిదర్శనాలు. ఇన్నాళ్లూ శర్మంటే ఒక పెద్ద అయిష్టతను కల్పించుకోవాలని ప్రయత్నిస్తూనే వుంది. కాని అది తన శక్తులకు సాధ్యమవటం లేదు. మరీ వెనుకటి ఘట్టాలు జ్ఞాపకం వచ్చినప్పుడల్లా అతనిపైని తను కోరని—కోరకూడని ఇష్టత అతివేగంతో తన హృదయమంతటా వ్యాపించసాగింది...ఇతనితో వెళ్లటంలో తను సమానబలం గల ఇంకో వ్యక్తితో జీవితసమస్యే తీరే పోట్లాటకోసం వెళ్తూన్నట్టనిపించింది. హాలు చేరేదాకా ఆమె మనస్సు మనస్సులో లేదు.

బాల్కనీలో కూర్చొని హాయిగా సినిమా చూస్తూన్న ఇతర్లవలె ఆమె ఏ ఆనందమూ పొందలేకపోయింది. అసలు ఇంతమంది తమ జీవితంలోని విచారాన్నంతట్నీ యీ కాస్సేపూ మరిచిపోగలిగి, యీ వెధవ సినిమాలో ఎలా ఆనందాన్ని సంపాయించగలుగు

తున్నారో ఆమెకు అర్థమవలేదు. పూర్వం తను ఎలా ఆనందాన్ని అనుభవించగలిగిందో ఆమె ఊహించలేకపోయింది ... కాని, తను పొరపడుతోందేమో? జీవితంలో ఎంత నటన ఉన్నా, ఒక్కో సమయానైనా అది మాయమవుతూవుండాలి. అసలు నిజంగా ఆనందాన్ని అనుభవించే వ్యక్తులుకూడా లోకంలో వున్నారు! అది తనకు దొరక్కపోవటంవల్లనే తనకు ప్రపంచమంతా విచారమయంగా కనిపిస్తోందేమో?

సినిమామీద ఆమెకు దృష్టే లేదు. మనశ్శాంతి డబ్బుతోనే కొనగలిగేదైతే ఎంత బాగుండేది! సగం ఆట అయేప్పటికల్లా కుర్రాడు గాఢనిద్రకు ఉపక్రమించాడు. ఇక యీ సినిమా తనకు తలనెప్పికూడా తెప్పించేట్టుంది. త్వరగా ఇంటికి వెళ్లి ఒంటరిగా మామూలుగా బాధపడటమే ఆమెకు మేలనిపించింది.

బాల్కనీఇవతలికి వచ్చి బైటికి చూసింది. శర్మ కారుమీద కుడికాలు మోపి తన మామూలు దృష్టితోనే ఎదుట వున్న ఎలెక్ట్రిక్ లైటుమీదికి సిగరెట్ పొగ వదుల్తున్నాడు. పాపం! అతని జీవితంలో ఎంత నిర్లక్ష్యత ఏర్పడ్డది! తనకు తెలియని దేనికో బతుకుతున్నట్టుగానూ, తనకీ లోకం చేసిన అన్యాయానికి చేతకానితనాన్నే దీన దృష్టుల్తో చెప్పుకుంటూన్నట్టూ ఆమెకు తోచింది.

మళ్లీ మామూలుమనిషవగానే, కల్యాణి, అతన్ని ఎలా పిలవాలో, ఏవిధంగా మాట్లాడాలో అర్థంకాక అక్కడే నిలబడ్డది. ఐదారు నిమిషాలు కాగానే శర్మ ఉన్నట్టుండి తల ఆమెవైపు తిప్పాడు. వెంటనే సిగరెట్ పారేసి ఆమెవైపు పరుగెత్తసాగాడు. శర్మ చూసిన చూపుకు వెంటనే లోపలికి పోదామని ఆలోచిస్తూన్న కల్యాణి—అప్పుడే తన ఎదుటకు వచ్చి ఆమెఆజ్ఞకోసం వేచి కూర్చున్నవాడిలాగు నిలబడ్డాడు. తనకు శర్మ ఇంత విధేయత చూపటంకూడా ఆమెకు కష్టంగానే వుంది.

తనెందుకు క్షణక్షణానికీ యీ శర్మను చూసి భయపడాలి? అతను తనకు అంత దగ్గరగా నిలబడ్డాక—దూరంగా ఉన్నప్పుడు అతను కలిగించే భయంలో ఇప్పటిది ఒక భాగమే ననేది స్పష్టమైంది. పన్నెండేళ్లకూ, ఇప్పటికీ జరిగిన మార్పుల్ని బట్టే నడుచుకోవాల్సిన—కనీసం నటించాల్సిన మానవుల్ని గూర్చి తను అపోహపడటంలోకూడా అర్థం లేదేమో!

“ఇంటికి వెళ్దాం... కుర్రాడు నిద్రపోతున్నాడు—” అంది మెల్లిగా, వేరో దిక్కు చూస్తూ.

శర్మ లోపలికి వెళ్లి కుర్రాణ్ణి భుజాన వేసుకొని వచ్చి, వెనుకసీటులో పడుకోపెట్టాడు. కారులో ఎక్కేప్పటికే ఆమెహృదయం మళ్లీ బరువెక్కసాగింది. కారు బయలుదేరే ముందు-ఎన్నాళ్లనుంచో బిగపట్టుకున్న ఊపిరిని వదుల్తూన్నట్టు శర్మ విడిచిన ఆ పెద్దనిట్టూర్పు ఆమెను— ఎందుకనో– మామూలుకన్న ఎక్కువగా భయపెట్టింది.

కారు బయలుదేరింది. కొంతదూరం వెళ్లేదాకా, ఆమెకు అది ఇందాకా వచ్చిన త్రోవలాగు లేదు. ఆమెకు ఇంతవరకూ వేస్తూన్న అనుమానమే ఆమెజాగ్రతను కాపాడుకోసాగింది.

“ఇంటికి వెళ్లాలి—” అంది కోపంతో కూడిన అధికారస్వరంతో.

కాని ఆమెమాటలకు యీసమయంలోమాత్రం విలువ లేకపోయింది. శర్మ అసలు ఏమాటల్నీ విననట్టే కారు వేగంగా నడుపుతున్నాడు.

ఆమె మళ్లీ మాట్లాడేందుకు శక్తి కూర్చుకునేప్పటికల్లా కారు జనసమ్మర్దప్రదేశాలన్నింటినీ గడిచిపోయింది.

“ఇటెక్కడికి?” అందామె గొంతెత్తి.

“నీతో మాట్లాడాలి” అన్నాడు శర్మ, వెనక్కు తిరక్కుండానే.

ఆమె భయంతో ఒణుకుతూ, లేచి నిలబడేందుకు ప్రయత్నిస్తూ అంది: “ఇప్పుడు కాదు – తరువాత మాట్లాడవచ్చు”

కాని శర్మ వినిపించుకోలేదు. కారువేగం క్షణక్షణానికీ ఎక్కువౌతూనేవుంది.

“జాగర్త – అరుస్తాను” అందామె.

“అరుపా? ఇక్కడ నీకెవరు పలుకుతారు?”

ఈమాటల్తోపాటే కారుకూడా ఆగింది. తను ఎక్కడ వుందో ఆమెకు తెలియలేదు. కారుముందున్న లైట్లుమాత్రం ముందున్న చెట్లగుంపుల్లో తమకు శక్తి వున్నంతవరకూ వెలుగును చూపుతున్నయ్. అటూ ఇటూ గాంధాంధకారం ఆవరించివుంది. ఆకాశంలోని నక్షత్రాలూ, కిందిగడ్డిలోని అక్కడక్కడ మెరిసే మిణుగురుపురుగులూ చీకటితో పోట్లాడ లేకపోతున్నాయ్. ఈ భయంకరప్రదేశంలో ఆమె ప్రాణాని కూడా భయపడ్డది. ఏం చేద్దామన్నా ఆమెకు పాలుపోవటంలేదు. అతనా- తనకన్న బలవంతుడు. తనా- తన కున్న శక్తినంతట్నీ తప్పనిసరిగా దాచుకోవాల్సిన అబల! ఎవరిదగ్గరా ఏమీ చెప్పుకునేందుకైనా వీలులేని పరిస్థితులు! అసలు ఒద్దనుకుంటూనే తను యీవెధవసినిమాకు ఎందుకు రావాలి? ఇలా తనను అగౌరవించటంలో అతని ఉద్దేశ మేమిటి? తను అరుస్తే ఏమన్నా ప్రయోజనం వుంటుందా? కుర్రాణ్ని లేపటం మంచిదా?...ఇన్ని ఊహలూ కలిసి ఆమెను రెండుమూడు నిమిషాలపాటు నిర్జీవప్రతిమను చేసినయ్.

"నేను నిన్నేమీ చెయ్యను...నువ్వు భయపడక్కర్లేదు"

ఆమె మాట్లాడలేదు. భయపడి లాభం లేదని తేలిపోయింది. తనకు తనే ధైర్యం చెప్పుకునేందుకు ప్రయత్నిస్తోంది. తీరా నీళ్లల్లోకి దిగాక మాయమయ్యే చలిలాగు, ఆపద ఇంత సమీప మయ్యేప్పటికి, ఆమె భయంకూడా క్రమంగా క్షీణించ మొదలిడింది.

"నన్ను మరిచిపొయ్యావ్ కదూ?" అన్నాడు.

ఎంత మధురంగా అడిగాడు! తన బాధకు దేనికో అతను కనిపెట్టిన మందులాగుంది ఆ కంఠం!

ఆమె తనకు తెలియకుండానే మాట్లాడసాగింది: "మరిచిపొయ్యానా? మరిచిపొయ్యానా?...మరిచిపోలేకపొయ్యాను"

"అది చాలా పూర్వపుకథ!"—నవ్వాడు.

"ఔను...మొదటనే! నీకోసం ఎంత విచారించాను!...ఇప్పుడు ఇంతక్రూరంగా నిన్ను మరిచినందుకు నన్ను నేను ఎంత దూషించుకున్నాను!"

ఇవి శర్మకు నమ్మదగ్గ మాటలుగా కనిపించలేదు.

వ్యంగ్యంగా అన్నాడు: "అలాగే యీభర్తతో హాయిగా కాపరం చేస్తున్నావ్?"

"అంతా అయ్యాక ఏం చెయ్యను? ఎవర్ని దూషించుకొని ఏం లాభం? నేను అనుకున్న విధంగా జీవితం నడవలేదు; జీవితమే నన్ను నడిపే యంత్రమైంది. తప్పనిసరిగా ఎదుర్కొన్న సమస్యలకు ఓడిపోయి, యీభర్తతోనే సరిపెట్టుకొన్నాను...ఈఐశ్వర్యాన్ని చూసి, యీకారును చూసి, ఈవిలువైన దుస్తులతోపాటే శరీరాన్ని ఆవరించుకున్న గర్వాన్ని చూసుకొని సంతుష్టిచెందాను. ఇలాటి బదులుసౌఖ్యాలతో మనశ్శాంతి సంపాయించేందుకు ప్రయత్నించాను. ఒకనాడు కాదు రెణ్ణాళ్లు కాదు, నాలుగు సంవత్సరాలకుకాని నేను నెగ్గలేదు...వీడు – యీ కుర్రాడు పుట్టినవాటినుంచీ నా అనురాగాన్నీ, ఆశల్నీ, జీవితసర్వస్వాన్నీ వీడిమీద కేంద్రీకరించుకొని, నా జీవితానికల్లా చిక్కిన ఏకైకసౌఖ్యమల్లే భావించుకొని మనశ్శాంతి పొందాను—"

శర్మకు కోపం వచ్చింది. ఆమెమనశ్శాంతి మాట వినగానే అతను ఎక్కడలేని యీర్ష్యకూ గురి అయ్యాడు. కాని వెంటనే ఉన్నది ఉన్నట్టుగా వెలిగక్కకుండా, "నువ్వు అబద్ధ మాడుతున్నావ్" అన్నాడు.

"నేనా?...అబద్ధాలా?... శర్మా! నా కుర్రాడితోడు – నేను నిజం చెప్తున్నాను!" అంది, దుఃఖం క్రమంగా ఆవరించుకుంటూన్న గొంతుతో.

"నువ్వు నీకై యీజీవితాన్ని కోరుకున్నావ్; నీతోపాటే నన్నుకూడా నాశనంచేశావ్. నేను – ఇల్లు వదిలాను. ఐనవాళ్లందర్నీ వదిలాను. లోకంలో ఒక్క మిత్రు డనేవాడుకూడా లేకుండా జీవయాత్ర సాగించాను. ఏకాకిగా జీవితాన్ని ఎదుర్కొన్నాను –"

అతని మాట పూర్తికాకముందే ఆమె అంది: "అంతా నాతప్పేనా? నే నేం చేశాను? నే నేం చేశాను? జీవితం నేను చెప్పినట్టుగా విన్నదా? నా కోర్కె ప్రకార మేమన్నా నడిచిందా? జీవితమూ, మనుషులే నన్నూ, నాశక్తుల్నీ కట్టేసి నడుపుకున్నారు.

నీకు తెలియదా శర్మా! ఇంటిపరిస్థితుల ఒత్తిడివల్ల యీ పెళ్లికి ఒప్పుకున్నాను; సంతానానికల్లా పెద్దదాన్నవటంవల్ల. అప్పుడే ఏమనుకున్నానో తెలుసా? నాశరీరంలో రక్తమాంసాలతో తయారుచేయబడ్డ హృదయమే నశించినట్లనుకున్నాను. ఒక్క త్యాగంతో – ఒక్క ప్రాణిబాధతోనన్నా కుటుంబాన్నంతట్నీ బాగుచెయ్యవచ్చని తలిచాను. భగవంతుడి దయవల్ల యీ వివాహంతో నాపుట్టిల్లు బాగుపడ్డది. ముసలి తల్లిదండ్రులకు మనశ్శాంతి లభించింది. చదువుకున్న తమ్ముళ్లిద్దరికీ ఉద్యోగాలు దొరికినయ్. నా చెల్లెలికి మంచి సంబంధం దొరికింది ... నాకు ఎవరిమీదా కోపం లేదు శర్మా! నేను ఒక్క విషయాన్ని గట్టిగా నమ్ముతున్నాను. మన అదృష్టానికి కానీ, దురదృష్టానికి కానీ – సౌఖ్యానికి కానీ, కష్టాలకు కానీ ఇతర్లను కారకులుగా తీసుకొని తృప్తిపడటంకన్న అవి మన తప్పులుగానే భావించుకోవటం మంచిది; న్యాయంకూడానేమో? అందుకనే నేను అనుభవించిన బాధకు నిన్ను కారకుడిగా తీసుకొని ఏం లాభం? నీ జీవితానిక్కూడా నేను జవాబుదారీ కాదు. అదృష్టవంతుడ్ని చెరిచేవాడూ, దురదృష్టవంతుణ్ని బాగుచేసేవాడూ లేడుగా! విధి నాకు ప్రసాదించిన సౌఖ్యాన్ని అనుభవించటంకన్న, ఇంతకన్న సౌఖ్యం లేదే అని విచారిస్తూ – ఉన్నదాన్ని కూడా పాడుచేసుకోవటం ఏం లాభం?"

ఆమెకంటివెంట నీరు కారుతోంది. శర్మ అంతా విన్నా ఒక్క మాటనుకూడా అర్థంచేసుకోలేడు. అసలు అతని ఊహలే వేరు. ఆమెనోటివెంట – ఇప్పటికైనా – తనే తన దైవమనటాన్ని వినాలని కూర్చున్నాడు. ఆనాటి స్నేహమే ఇతర అడ్డంకులు లేకుండా యీనాటివరకూ పెరిగినట్లయితే ఆమె ఏ విధంగా మాట్లాడివుండేదో – ఆ రకం మాటల్ని వినాలని ఎదురు చూస్తున్నాడు.

అన్నాడు: "సరే ... చాలా వేదాంతాన్ని చెప్పావ్. ఇప్పటికన్నా నువ్వింతవరకూ వదులుకున్న సౌఖ్యాలకై ఎందుకు ప్రయత్నించవు?"

"ఎట్లా?"

"ఎట్లాగా? ... ఇప్పటికీ నేను కావాలా?"

"నువ్వు లేకపోతే యీ జీవితమే లేదు; నువ్వు పీల్చి వదిలే గాలి లేకపోతే నా శ్వాసే ఆగిపోతుంది" అని ఆమె అంటుందనుకున్నాడు!

కాని ఆమె యీ ప్రశ్నకు వెంటనే సమాధానం చెప్పలేకపోయింది. ఒక్క నిమిషం శూన్యంలోకి చూసి, శర్మవైపు చూడకుండానే అంది: "అది నన్ను అడగొద్దు శర్మా! ఆ కలలో బాధనే అనుభవించామో, సౌఖ్యాన్నే అనుభవించామో ఇవాళ ఆలోచిస్తూ బాధపడటంకన్న, ఇవాల్టి సౌఖ్యాన్నే అనుభవించటం ఉత్తమం –"

"అందుకనే –"

శర్మమాటకు అడ్డువచ్చి, "ఆ మాటలేమీ వద్దు. నిజం చెప్తున్నాను. నేను జీవితంలో తిరిగి నిన్ను చూడగోరలేదు. అందుకనే నువ్వు ఎదురైన నాడు నావిధిని దూషించుకున్నాను –" అంది.

శర్మ గట్టిగా కోపంతో నవ్వి, "నామీద ఇష్టం లేనట్టు యీ మాటలే చెప్తున్నయ్" అన్నాడు.

"కాదు శర్మా! నేనిలా ఎందుకు కోరానను కున్నావ్? నువ్వు మళ్లీ కనిపిస్తే హృదయంలో అడుగున పడిపోయిన అనేక పాతవిషయాలన్నీ జ్ఞాపకమొచ్చి బాధపడతానని. ఇంతదూరం జీవితంలో ముందుకు సాగాక వెనుక నడిచిన దారిని చూడటం ఎంత బాధావహమో నీకు తెలియదూ?"

శర్మ మాట్లాడలేదు. ఆమె చెప్పిన మాటల్ని జీర్ణించుకునేందుకు ప్రయత్నిస్తున్నాడు. మళ్లీ ఆమె అందుకుంది:

"నువ్వు పనిలో చేరిన ఆసాయంత్రంనుంచీ – నేను గత పన్నెండేళ్లనుంచీ బతుకుతూన్న కల్యాణిని కాదు! జీవితరాక్షసిబరువైన హస్తం అప్పుడే మీద పడగా, పెద్దనిద్దురనుంచి మేల్కొన్న కల్యాణిగా మారాను. నామనశ్శాంతంతా భంగమైంది. రాత్రులు నిద్రే లేదు. జీవితంలో నన్ను ఆనందింపజేసే ప్రతివస్తువా తన పనిని మానుకుంది. నిన్ను చూడటం మంటేనే భయంగా

వుంది. ఇలా మరికొద్దిరోజులు సాగుతే, పిచ్చి కూడా ఎక్కుతుందనే భయంగా వుంది. ఇది నిజం - నమ్మవా?"

ఆ చివరిమాట శర్మమీద బాగా పనిచేసింది. మాటకన్న ఎక్కువగా ఆమెకంఠమే అతన్ని నమ్మించింది. కొద్దిరోజులనుంచీ అతనిలో పనిచేస్తూన్న దుష్టపు తలపులన్నీ దూరదూరాలకు తరుమవేయబడినయ్. పెద్ద ఆత్మవిశ్వాసంతో పోరాటానికి దిగి, అనుకోకుండా ఓడిపోయిన పెద్దరస్తాదులాగు శర్మ నిశ్చేష్టుడై నిలబడిపోయ్యాడు.

"నాజీవితానికి క్రూరుడుతప్ప ఇంకేమీ అక్కర్లేదు. నామనశ్శాంతి అంతా వాడిమీదనే ఆధారపడి వుంది. నన్నూ, వాణ్ణీ కరుణించు... నేను నీనుంచి కోరేది ఒక్కటే—"

"ఏమిటేః?" అనగలిగాడు శర్మ. ఇప్పటికే ఆమె కన్నీరు అతని హృదయాన్ని తాకకుండానే కరిగించివేయగలిగింది.

"నువ్వు సాధ్యమైనంత త్వరలో యీప్రదేశాన్ని వదలివెళ్లిపో. నన్నూ, నాకుమారుణ్ణీ, భర్తనూ ఎప్పటిలాగు బతకనీ. ఉన్న సమస్యలకు — నువ్వు ఎదురుగా ఉండి ఇచ్చే సమస్యే ఎక్కువైపోయింది. ఆబాధను చాలాటి సున్నితజీవితానికి అలవాటుపడ్డ మానవప్రాణి భరించలేదు ...... నువ్వు వెళ్లిపో — ఎక్కడికైనా సరే! ఈమాటను నేను ఏ అధికారంతోనూ అనటంలేదు. మానవుడు మానవుడినుంచి కోరదగ్గ సానుభూతికోసం, దయకోసం నిన్ను ప్రార్థిస్తున్నాను—"

ఈరకంమాటల్ని శర్మ ఇక వినదలుచుకోలేదు. ఇప్పటికే అతని శక్తు లన్నీ కట్టివేయబడినయ్. అతని హృదయం కొట్టుకోవటాన్ని అతను స్పష్టంగా వినగలుగుతున్నాడు. ఈ ఓడినప్రదేశాన అత నింక ఉండదలుచుకోలేదు. చప్పున కారు స్టార్టుచేశాడు.

ఆమె అంది: "ఇలాటి సంఘటనలు ఇంక వద్దు. నన్ను విడిచిపో. ఈ క్రూరురాల్ని నీకళ్లఎదుట ఎందుకుంచుకుంటావ్?"

అతను సమాధానం చెప్పలేదు. అసలు ఇంతవరకూ ఏమీ జరగనట్టుగానే, మామూలుకారుడ్రైవరు మొహంతో ఎలాగో కారును ఇంటిదాకా లాక్కురాగలిగాడు!

